క్లుప్తంగా

చండీ అవతారంలో దుర్గాదేవి



చండీ ఆకారంలో దర్శనమిస్తున్న దుర్గాదేవి

మునగపాక : మండల వ్యాప్తంగా దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు చండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద భారీ అన్న సమారాధనలు నిర్వహించారు.

నేవీ నిర్మాణ కార్మికులకు బోనస్ చెల్లించాలి

రాంబిల్లి : నేవీ నిర్మాణ కార్మికులకు బోనస్ చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నేవీ మెయిన్ గేటు సమీపంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఒక నెల జీతం బోనస్‌గా చెల్లించాలన్నారు. అలాగే స్థానికులకు నిర్మాణ పనుల్లో ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ



క్రిమి సంహారక మందును వరిపంటపై పిచికారీ చేస్తున్న డ్రోన్

రాంబిల్లి: డ్రోన్‌తో క్రిమి సంహారక మందులు పిచికారీతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని హరిపురం బీసీటీ కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంతగౌడ అన్నారు. నారాయణపురంలో రైతు గణేష్ వరి పొలంపై డ్రోన్ సాయంతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. డ్రోన్ స్ప్రేయింగ్‌తో తక్కువ సమయంలో పిచికారీ తక్కువ ఖర్చు అవుతుందన్నారు. అంతేగాక మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శైలజ కుర్రా, బండి నాగేంద్రప్రసాద్, వాన ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి: పాయకరావుపేట విద్యుత్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం పెద్దాపురం వారు లైన్ క్లియరెన్స్ తీసుకోవడం వల్ల పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో పలు ప్రాంతాల్లో 20వ తేదీ శనివారం, త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ అనకాపల్లి కె.రాజశేఖర్ తెలిపారు. నక్కపల్లి మండలంలో ఉపమాక, గొడిచర్ల, వేంపాడు, పాయకరావుపేట మండలంలో పాయకరావుపేట, శ్రీరాంపురం పాల్మన్‌పేట పరిధిలో గల వ్యవసాయ ఫీడర్‌లకు త్రీఫేజ్ సరఫరా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 4 నుంచి 9 వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇస్తామన్నారు. రైతులు ఈ మార్పులు గమనించి సహకరించాలన్నారు.

యలమంచిలి మండలంలో...

యలమంచిలి : యలమంచిలి మండలం, ఎస్.రాయవరం మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. 132 కేవీ లైనులో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయంగా ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేయబడుతుందని తెలిపారు. పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో గల పులపర్తి, పద్మనాభరాజుపేట, బయ్యవరం, పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం, రామభద్రపురం, రేగుపాలెం, వెంకునాయుడుపాలెం గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

జగనన్న సురక్ష..ప్రజారోగ్యానికి రక్ష

యలమంచిలి : రాష్ట్రంలో ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లి గ్రామంలో గురువారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి ప్రారంభించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందేలా చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీలో ముగ్గురు వైద్యులు ఉండేవారని, తగినంత వైద్య సిబ్బంది లేక మందుల కొరతతో ప్రజలకు సకాలంలో వైద్యం అందేది కాదన్నారు. ఇపుడు ఏడుగురు వైద్యులు, ఆపరేషన్ పరికరాలు, 104 రకాల మందులు జగనన్న ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెరువుపల్లి గ్రామంలో గతంలో మౌలిక సదుపాయాలు ఉండేవి కావని, జగనన్న ప్రభుత్వం వచ్చాక విలీన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవింద్, కౌన్సిలర్ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, కోఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్ బీబీ, మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

నక్కపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ , విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నంతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం దివంగత నేత వైఎస్సార్ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తే ఆయన తనయుడు ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగిస్తూ కొత్తగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చారన్నారు. శిబిరంలో కొత్తపేట, టీచర్స్‌కాలనీ, రెల్లికాలనీ, బండారుపేట, మనబాలవానిపాలెం గ్రామాల నుంచి సుమారు 800 మంది వచ్చి వైద్య సేవలు పొందారు. డాక్టర్ సుకన్య,డాక్టర్ యశశ్వి కృష్ణ వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కుంచం నరేష్, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, వార్డు సభ్యులు బంగారాజు, అల్లాడ కొండ, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో రోగులకు పూర్తి స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలో గల పెంటకోట గ్రామంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజలకు వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి హాజరైన రోగులకు మందుల కిట్‌లను పంపిణీ చేశారు. కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి, రుచి చూశారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో వైద్యులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ ఎం.కిషోర్ సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో 410 మంది రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్ష, బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ సూరిబాబు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. చౌడువాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ఆకట్టుకుంది. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ శిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన వైద్య శిబిరాలకు 3766 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. ఇక్కడ 334 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకోగా, 96 మందిని ప్రత్యేక వైద్య నిపుణులు, 94 మందిని కంటి వైద్య నిపుణులు పరీక్షించినట్టు తెలిపారు. వైద్యులు సంతోష్‌కుమార్, బి.మానిక, కె.సుదీప్, ఎస్.ఝాన్సీ, పి.ఎస్.గోదాదేవి, బి.కృష్ణరమాదేవి, సర్పంచ్ గోపాలకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాయకరావుపేట : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్రంలో పేదలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కల్పించిన వరం అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలో గల పెంటకోట గ్రామంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. రాష్ట్రంలో 5 కోట్ల ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ గ్రామ స్థాయి నుంచి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపించి వైద్యం చేయిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ సూరిబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని చీమలాపల్లిలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రారంభించారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్య ఆంధ్ర కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. శిబిరంలోని స్టాల్స్ పరిశీలించారు. శిబిరాన్ని అదనపు డీఎంహెచ్‌వో బాలాజీ సందర్శించారు. కోన బుజ్జి, నర్మాల కుమార్ తదితరులు పాల్గొన్నారు. 375 మంది అవుట్ పేషెంట్స్‌గా రాగా,16 మందికి ఉన్నత వైద్యానికి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. వైద్యాధికారులు రజనీ, అలేఖ్య, గైనకాలజిస్టు సుచరిత, జనరల్ సర్జన్ సునీలు వైద్య పరీక్షలు చేశారు.

మునగపాక : వైద్య రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. నాగులాపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. 140 రకాల మందులు శిబిరంలో అందుబాటులో ఉంచామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన వంటకాలను రుచి చూశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీజయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

గుర్రాజుపేటలో...

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని ఎంపీపీ కోన లోవలక్ష్మి అన్నారు. గుర్రాజుపేట గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని పట్టణ ఆసుపత్రులకు తరలించాలన్నారు. అనంతరం పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 384 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఐదుగురిని ఆరోగ్య శ్రీ వైద్య పరీక్షలకు పట్టణ ఆస్పత్రులకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రత్నం, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామరాజు, మధురాజు, రాజారమేష్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రమేష్, రామలక్ష్మి పాల్గొన్నారు.



తెరువుపల్లి గ్రామంలో వైద్య శిబిరానికి భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ప్రజాప్రతినిధులకు బీపీ, షుగర్ టెస్టులు చేస్తున్న వైద్య సిబ్బంది



శిబిరంలో పోషక పదార్థాలను ప్రదర్శించిన అంగన్‌వాడీ సిబ్బంది



చౌడువాడ వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏడీఎంహెచ్‌వో బాలాజీ



ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్న చిక్కాల రామారావు



పెంటకోటలో పత్రికా విలేకర్లతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



నాగులాపల్లిలో అంగన్‌వాడీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



పెంటకోట ఆరోగ్య సురక్ష శిబిరంలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి

రాంబిల్లి : సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జి.శిరీష అన్నారు. రాంబిల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో రాంబిల్లి మండలం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అయితే సర్వసభ్య సమావేశాలకు పలువురు అధికారులు గైర్హాజరు కావడం, కింది స్థాయి సిబ్బందిని పంపడం సరికాదన్నారు. దీనికి స్పందించిన ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు గైర్హాజరైన అధికారుల విషయంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కె.నర్సింగరావు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ శిరీష తదితరులు

వరిలో సస్యరక్షణపై అవగాహన

యలమంచిలి : వరిలో సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ సహాయకులు అవగాహన కలిగి రైతులకు వివరించాలని యలమంచిలి వ్యవసాయ సహాయక సంచాలకుడు రవి ప్రకాష్ సూచించారు. గురువారం యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో మండలంలో వ్యవసాయ సహాయకులకు సస్యరక్షణలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకుమడుత సుడిదోమ నివారణ, ఎండు తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సహాయకులు పొలాల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మోహరావు, రూప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ రవిప్రకాష్, వ్యవసాయాధికారి మోహనరావు

తెగుళ్లను నివారించుకోవాలి

మునగపాక : వరిలో తెగుళ్ల సమస్యపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్య కోరారు. ఉమ్మలాడలో కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో వరిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరికి సంబంధించి పాము పొడ తెగులు సోకుతున్నట్టు గుర్తించామని, దీని నివారణకు లీటరు నీటిలో 2 ఎంఎల్ హెక్సాకొనజాల్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత తెగులు నివారణకు లీటరు నీటిలో 1.5 గ్రాముల ఎసిఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు

చిరుధాన్యాల ఉత్పత్తులతో ఆర్థిక భరోసా

అనకాపల్లిటౌన్: మహిళా రైతులు ఎన్నో పోషకాలు కలిగిన చిరు ధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే చిన్న పరిశ్రమలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుని, ఆర్థిక భరోసా పొందాల్సిందిగా ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. స్థానిక సాంకేతిక పరిజ్ఞానం విభాగంలో చెరకు, చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చిరుధాన్యాలతో రూపొందించే ఆహారపదార్థాలపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ మహిళా రైతులు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని కోరారు. జాగృతి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రైతులకు ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ ఇవ్వటంపై ఆనందం వ్యక్తం చేశారు. మరో శాస్త్రవేత్త పి.శ్రీదేవి మాట్లాడుతూ బెల్లం చాక్లెట్లు, చెరకు రసంతో జెల్లీలు, బెల్లం బిస్కెట్లు తయారుచేసే విధానాన్ని వివరించారు.

నేవీ నిర్వాసితులకు ప్యాకేజీ చెల్లించాలని వినతి

రాంబిల్లి : నేవీ నిర్వాసితులకు రూ.1.30 లక్షల ప్యాకేజీతో పాటు పెండింగ్ ప్యాకేజీలను చెల్లించాలని మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మహాధర్నా చేసిన సమయంలో అధికారులు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ 1.30 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదని తెలిపారు. తమకు ప్యాకేజీలు చెల్లించకపోతే నవంబర్‌లో మళ్లీ ధర్నాకు దిగుతామన్నారు.

ఆరో రోజుకు చేరిన వేసవి శిక్షణ శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో ఆరో రోజు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు.గురువారం జరిగిన ఈ శిబిరంలో భాగంగా విద్యార్థులు పుస్తకాలు చదువుతూ, కఠిన పదాల అర్థాలను తోటి విద్యార్థులతో చర్చిస్తూ తెలుసుకున్నారు. లైబ్రేరియన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మెలిపాకలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మునగపాక : మెలిపాకలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు భోగాపురంలో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని భోగాపురం ఈ నెల 20న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు ఈ శిబిరానికి విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య సేవలు



నక్కపల్లి ఆస్పత్రిలో రోగులు, సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ బంగారయ్య

నక్కపల్లి: బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అడ్డురోడ్డులో కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు కేజీహెచ్ పూర్వ ఆర్‌ఎంవో, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ బి.బంగారయ్య తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామని, తమ సిబ్బంది ద్వారా కేజీహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న నక్కపల్లి 50 పడకల ఏరియా ఆస్పత్రిలో ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావుల సహకారంతో ట్రామాకేర్ సెంటరు ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. పాములవాకలో మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న చేదోడు లబ్ధిదారులతో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించి జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి థ్యాంక్యూ సీఎం సార్ అంటూ తమ అభిమానాన్ని చాటారు.



పాములవాకలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చిరువ్యాపారులు

ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలి

మునగపాక : ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం బీఎల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. అలాగే జాబితాల్లో చేర్పులు, మార్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఓటరు ముసాయిదా సక్రమంగా జరగాలన్నారు. పలువురు బీఎల్‌వోలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్

అలాంటి తండ్రులున్న ఇల్లు 'ఇంద్రప్రస్థం'

అనకాపల్లిటౌన్: గవరపాలెం గౌరీ సేవా సంఘం మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న కర్రి రమేష్ స్మారక ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ ఐదో రోజు పోటీలను రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు రమణమూర్తి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. సతకంపట్టు శ్రీ కనకదుర్గమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న నాటికోత్సవాల్లో గుంటూరు అభినయ్ వారి సాంఘిక నాటిక ఇంద్రప్రస్థంను ప్రదర్శించారు. ప్రేమ పేరిట అనాలోచిత నిర్ణయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్న నీతిని నాటిక ద్వారా వివరించారు. ఓ తండ్రి తన కొడుకు ప్రేమ విషయాన్ని తెలుసుకుని, అమ్మాయి తండ్రి గురించి ఆలోచించడం, ప్రేమికుల తప్పుల్ని సరిదిద్దుతూ, కొన్ని షరతులతో వారిలో క్రమశిక్షణను పెంచడం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అలాంటి తండ్రి ఉన్న ప్రతి ఇల్లూ ఇంద్రప్రస్థమేనంటూ ముగింపు పలికారు. శ్రీస్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రరెడ్డి(తండ్రి పాత్రధారి) దర్శకత్వం వహించారు.



ఇంద్రప్రస్థం నాటికలో ఓ ఘట్టం